వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# మదనపల్లెలో చిటీల వ్యాపారి కోట్లల్లో కుచ్చుటోపి

## చీటీల నిర్వాహకులు ఇంటిముందు వాగ్వాదం

మదనపల్లెక్రైం, మార్చి 10 ప్రభాతవార్త :మదనపల్లెలో ఓ ప్రముఖ వ్యక్తి చీటీల వ్యాపారం చేస్తూ ప్రజలకు కుచ్చుటోపి పెట్టాడు. కోట్లల్లో ఎగనామం పెట్టడంతో మోసపోయిన బాధితులు లబోదిబో అంటూస్థానిక చీటీల నిర్వాహకుడి ఇంటి ముందు పెద్దఎత్తున బాధితులు చేసుకొని గొడవకు దిగారు. మదనపల్లె పట్టణంలో ఆదివారం జరిగిన ఘటనపై వివరాలిలావున్నాయి. అమ్మినేనివీధిలో ఉండే క్రిష్టారెడ్డి గత కొన్నేళ్ళుగా చీటీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇతను కొంతకాలంగా చీటీలు అయిపోయన వారికి డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పలువురు బాధితులు ఆయన నివాసం ఉంటున్న ఇంటివద్దకు చేరుకొని గొడవకు దిగారు. మదనపల్లెలో పెద్దసంఖ్యలో ఆయన వద్ద చీటీలు వేస్తున్నట్లు వెల్లడవుతోంది. ఒకొక్కరికి రూ.లక్షలు డబ్బులు చెల్లించాల్సి ఉండడంతో తమ డబ్బు తమకు ఇవ్వాలని గొడవకు దిగారు. అడిగితే డబ్బులు ఇవ్వడం లేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని బాధితులు ఇంటి వద్ద గొడవకు దిగడంతో క్రిష్టారెడ్డి ఈనెల 25వరకు గడువు ఇవ్వాలని డబ్బు చెల్లిస్తానని చెప్పడంతో బాధితులు వెనుదిరిగారు. అయితే పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

# నేడు పులివెందులలో పర్యటించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

## - రూ.861.84కోట్లతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

- 14612మంది పోలీసు సిబ్బందితో భద్రత



పులివెందుల, మార్చి 10, ప్రభాతవార్త ః రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం పులివెందులలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి బయలుదేరనున్నారు. ఉదయం 10.45గంటలకు బాకరాపురంలోని హెలిప్యాడ్‌కు చేరుకోనున్నారు. పులివెందుల పట్టణంతో పాటు, ఇడుపులపాయలో రూ.861.84కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. పులివెందులలోని కడప రోడ్డులో నాబార్డు, ఆర్ఐడిఎఫ నిధులతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను సీఎం ప్రారంభించనున్నారు.

# సీఎం పర్యటనపై సిబ్బందికి దిశా నిర్దేశం చేసిన ఎస్పీ

## - పులివెందులలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన



కడప క్రైం, మార్చి 10, ప్రభాతవార్త: ఈనెల 11న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం పులివెందులలో సీఎం పర్యటించే ప్రాంతాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. పులివెందుల-కదిరి రోడ్డులోని ఎస్‌సీఆర్‌సీ కల్యాణమండపంలో పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన బ్రీఫింగ్ నిర్వహించారు. కడప ఎయిర్‌పోర్టు, పులివెందుల హెలిప్యాడ్, పలుప్రారంభోత్సవ కార్యక్రమాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, కర్నూలు అదనపు ఎస్పీ (అడ్మిన్) నాగరాజు, పోలీసు అధికారులు, ఇతర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంత ఎన్నికలు కోసం ఫ్లాగ్‌మార్చ్ డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి



మదనపల్లెక్రైం, మార్చి 10 ప్రభాతవార్త : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరపాలనే ఫ్లాగ్‌మార్చ్ చేపట్టినట్లు మదనపల్లె డిఎస్‌పి ప్రసాద రెడ్డి తెలిపారు. జరగబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహన ధ్యేయంగా కేంద్రసాయుదు బలగాలైన ఎస్ఎస్‌బి ఫోర్స్, సబ్ డివిజన్‌లో పరిధిలోని పోలీస్ అధికారులు సంయుక్తంగా పట్టణంలో ఆదివారం సాయంత్రం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్‌మార్చ్ నక్కలదిన్నె నుంచి సురబీకాలనీ, గాంధీపుర, పిఅండ్‌టి కాలనీ, సొసైటి కాలనీ, ఎన్‌టిఆర్ సర్కిల్ బింసెట్ సర్కిల్, అప్పారావుతోట,వెంకటరమణస్వామి దేవాలయం వీది, ఎంఎస్‌ఆర్ సర్కిల్, మెట్రోసిర్కల్ ఇందిరా నగర్ తదతర ఫ్లాగ్‌మార్చ్‌చేసి ప్రజలలో అపత్రత భావాన్ని తొలగించడానికి శాంతియుత వాతావరణం లో పోలింగ్ జరిగేలా శాంతిభద్రలతే లక్ష్యంగా ఫ్లాగ్‌మార్చి నిర్వహించడం జరిగిందని డిఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు వల్లిబాష, యువరాజు, శేఖర్, ఎస్ఐలు, సబ్‌డివిజన్‌లోని సిబ్బంది పాల్గొన్నారు.

# వీరభద్రాలయంలో లోక కల్యాణం కోసం ఛండీహోమం

## - ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి గ్రామీణ, మార్చి 10, ప్రభాతవార్త: రాయచోటిలో వెలసిన వీరభద్రుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లోక కల్యాణం కోసం ఛండీహోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైసీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి ఆలయ కమిటీ ఛైర్మన్ పోలంరెడ్డి విజయ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ దశరథరామిరెడ్డి, ఈవో రమణారెడ్డిల ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. వేదపండితులు వేద మంత్రోచ్చారణలతో హోమం నిర్వహించారు. హోమాన్ని భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించడం అభినందనీయమని ఆలయ కమిటీ సభ్యులను కొనియాడారు. భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి ఆశీర్వాదాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.అనంతరం ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వార్త తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# నేటి నుండి ప్రారంభం కానున్న గంగమ్మ జాతర

## -చలువ పందిళ్లు,క్యూలైన్లతో భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు

అనంతపురం గంగమ్మ దేవత ఆలయంకు చేరిన గొల్లపల్లె గంగమ్మ తల్లి





లక్కిరెడ్డిపల్లె, మార్చి 10,ప్రభాతవార్త: నేటి నుండి ప్రారంభం కానున్న గంగమ్మ జాతరకు లక్షల్లో తరలి రానున్న భక్తులకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు అమ్మవారి దర్శనం కోసం భక్తులకు ఇబ్బందులు కలగకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేసి క్యూలైన్లు ఏర్పాటు చేశారు.జాతరకు వచ్చే మహిళలకు శాశ్వత స్నానపు గదులను,మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చారు.ఆలయం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించడంతో కొత్త శోభ నెలకొంది.జాతరకు ఇప్పటికే మిఠాయి బండ్లు,చెరుకుల బండ్లు,హోటళ్లు,శీతల పానియాల అంగళ్లు,రంగుల రట్నాలు,సర్కస్ కోసం ఏర్పాట్లు పూర్తవడంతో జాతర శోభ ప్రారంభమైంది.ఇప్పటికే భక్తులు జాతరకు చేరుకోవడంతో అమ్మవారి దర్శనం కొరకు క్యూలైన్లల్లో భక్తులు వేచి ఉన్నారు.దాతల సహకారంతో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు చేయడానికి ప్రక్క రాష్ట్రం నుండి పూలను తెప్పించి అలంకరణ చేయడానికి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డెయ్య,ప్రత్యేక అధికారి రవీంద్రరాజు,మండల ఉపాధ్యక్షులు సమరసింహా రెడ్డి,సర్పంచ్ వెంటనారాయణ రెడ్డి లు ఆలయంకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ ఉన్నారు.రాయచోటి డిఎస్పీ మహబూబ్ బాషా,సిఐ జీవన్ గంగనాధ బాబు,ఎస్.ఐ విష్ణువర్ధన్ బాబు,తమ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ సమస్య లేకుండా,రోడ్డు పరిధిలోని వాహనాలకు లోనికి అనుమతి లేకుండా బౌండరీ లైన్లను ఏర్పాటు చేశారు.భక్తులకు త్రాగునీటి సమస్యను తీర్చడానికి లక్కిరెడ్డిపల్లెకు చెందిన విలేకర్లు ఉచితంగా నీళ్ల ప్యాకెట్లు,వాటర్ బాటిళ్లను,మజ్జిగ ప్యాకెట్లను అందించడానికి సిద్ధం చేశారు.అయ్యప్ప సేవాసమితి,గంగమ్మ తల్లి సేవాసమితి,మానవతా స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలోను భక్తులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు,నీళ్ల ప్యాకెట్లను పంపిణీ చేయడానికి ఆలయం లోపలికి చేర్చారు.ఆలయ అర్చకులు చెల్లు నారాయణ వంశీయులు శ్రీనివాసులు,రవి, మునీంద్ర, సూరి,వచ్చిన భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహాజంపజేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





# కుందూనది లో ప్రమావశాత్తు మునిగి అక్కా తమ్ముడు మృతి



రాజుపాళెం,మార్చి10,ప్రభాతవార్త. మండల పరిధిలోని కూలూరు గ్రామ సమీపంలోగల కుందూనదిలో ఆదివారం ప్రమాదవశాత్తు షేక్ ఇమాంబి,(27) పరీకమస్తాన్ (26)లు నీట మునిగి అక్కా తమ్ముడు మృతి చెందారు.ఈవిషయమై ఏయస్ఐ సిద్దయ్య కేసు నమోదు చేసుకొని దార్యప్తు చేస్తున్నట్లు తెలిపారు.వివరాలలోకి వెళ్ళితే నంద్యా జిల్లా చాగలమర్రి గ్రామనికి చెందిన వారు అనారోగ్యంతో సమస్య పరిష్కరించుకొనుటకు ఇమాంబి,ఆమె భర్త,ఆమె తమ్ముడు కలిసి యర్రగుంట్ల దర్గా వద్ద మృతురాలు ఇమాంబి ఆరోగ్యం సరిగా లేక పూజలు చేయించుకొని భర్త ఖాజాహుశేన్ మృతులు ఇరువురితో కుందూనది వద్దకు వచ్చి అక్కడ ఏదో స్నానం ఆచరించాలని అక్కాతమ్ముడు వెళ్ళగా మృతురాలి భర్త నది కట్ట పైననే ఉండగా స్నానం చేయుటకు దిగిన ఇరువురు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయినట్లు ఆమె భర్త ఖాజాహుశేన్ ఇచ్చిన పిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దార్యప్తు చేస్తున్నారు. రెండు మృాతదేహాలను శవపరీక్షల నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఇమాంబికి కుమారుడు,ఒక కుమార్తె ఉన్నారు. పకీర్ మస్తాన్‌కు నాలుగు నెలల కుమార్తె ఉన్నది.క్షేమంగా జీవనం సాగించుటకు ఆరోగ్య సమస్యను తీర్చుకోవాలని పూజలు,యంత్రాలు అంటూ ఇద్దరు నీటమునిగి మృత్తువాత పడటం విశేషం .



# వాగేటికోన ప్రారంభించిన ప్రభుత్వ విప్

## -12.50కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ప్రారంభం

ఫోటో:ప్రవహిస్తున్న వాగేటి కోన

ఫోటో:చుక్క నీటికి నోచుకోని కుప్పాలమ్మ చెరువు.

రైల్వేకోడూరు అర్బన్,మార్చి 10,ప్రభాతవార్త: గత మూడు సంవత్సరాల ముందు గానే పూర్తయిన వాగేటి కోన ప్రాజెక్టు పనులు ఆదివారం ప్రారంభానికి సిద్ధమయ్యాయి. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని వాగేటి కోన ప్రాజెక్టు 12.50 కోట్లతో చేపట్టి పనులు పూర్తయిన సందర్భంగా రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆదివారం ప్రాజెక్టును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనివలన సుమారు 2500 ఎకరాలు సాగునీరు,దీనికోసం ప్రభుత్వం 12.50 కోట్ల ఖర్చు చేసి ప్రాజెక్టు పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు.దీని ద్వారా సుమారు 10 చెరువులకు సాగునీరు చేరే అవకాశం ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో అన్ని విధాల ముందుందని,ఇప్పటికే రైల్వేకోడూరు నియోజకవర్గంలో పలు రకాల అభివృద్ధి పనులు కోసం వందల కోట్ల నిధులు కేటాయించి,అభివృద్ధి పనులు జరిగాయని,ఆయన తెలియజేశారు.అయితే వాగేటి కోన ప్రాజెక్టు నీటితో కళకళ లాడుతుంటే దాని చుట్టుపక్కల ఉన్న చెరువులు నీరు చేరిక దాహంతో వెలవలలాడి,ఎడారులుగా తలపిస్తున్నాయి.దీంతో 2500 ఎకరాలకు సాగునీరు అందుతుందన్న అధికారుల ఆలోచనలు నీరుగారినట్లే ఉన్నాయి.చుట్టూ ఉన్న చెరువులకి ప్రాజెక్టు నుంచి చుక్క నీరు చేరేందుకు నోచుకోలేదు.దీనికి గాను ఆక్రమణదారుల కూడా దాదాపు అన్ని చెరువులను పూర్తిగా ఆక్రమించి,చెరువులకు వచ్చే సాగునీటి కాలవలను పూర్తిస్థాయిలో పూడ్చి,తాగునీటి చెరువులను భూములుగా మార్చుకున్నారు.







# పేదల సంక్షేమమే వైసీపీ లక్ష్యం

బద్వేలు అర్బన్, మార్చి 10 ప్రభాతవార్త : పేదల సంక్షేమమే వైసీపీ లక్ష్యమని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు శ్రీకృష్ణదేవరాయనగర్‌లో వార్డు కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణతో కలిసి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. వార్డులోని ప్రతి నివాసాన్ని తిరిగి సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. పాదయాత్ర సమయంలో జగన్ ప్రజా సమస్యలను తెలుసుకుని అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నారన్నారు.దివంగత వైఎస్సార్ ఆశయాలు జగన్‌తోనే సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న అబివృద్ధికి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసిన ముఖ్యమంత్రిని మరోసారి గెలిపించుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలన్నారు. అంతకు ముందుగా పూలమాలలు, బాణ సంచా వారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు గుర్రంపాటి సుందరరామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ రమణారెడ్డి, యోగివేమన యూనివర్సిటీఈ ఈసీ మెంబర్ కొండపలి చిన్న సుబ్బారావు, వంకెల పోలిరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గోపాల స్వామి, యాదవ సంఘం అధ్యక్షులు బుర్రి రాజా యాదవ్, రూపరాంపేట శివాలయ బోర్డు ఛైర్మన్ మడకల రఘురామిరెడ్డి, తోట నాగేశ్వరరావు, 9వ వార్డు కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్‌రాజు, భూమిరెడ్డి ఓబుల్‌రెడ్డి , పెంచల బాబు, డాక్టర్ శ్రీను,తదితరులు పాల్గొన్నారు.



# రామాపురంలో ఉద్రిక్తత

## - సాయినాథ్‌శర్మపై పుత్తా అనుచరులు దాడి

కమలాపురం, మార్చి 10, ప్రభాతవార్త: గత కొంత కాలంగా టీడీపీకి దూరంగా ఉంటున్న సాయినాథ్‌శర్మ పెద్ద చెప్పలి గ్రామంలో ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి వైసీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ సమావేశాన్ని అడ్డుకు నేందుకు పలువురు సాయినాథ్‌శర్మ అను చరులను పుత్తా అనుచరులు తీసుకెళ్లారు. తన అనుచరులను పరామర్శించేందుకు సాయినాథ్‌శర్మ పెద్దచెప్పలి వెళ్లారు. అనంతరం రామాపురానికి వెళ్తుండగా సాయినాథ్‌శర్మపై పుత్తా అనుచరులు దాడి చేశారు. శాంతి భద్రతల విషయంలో పెద్దఎత్తున పోలీసులు మోహరించి పటిష్ట చర్యలు చేపట్టారు.



# టీడీపీ, జనసేన స్కూటరు ర్యాలీ అదరహో..!

**- జయ(న) సంద్రమైన బి.కొత్తకోట- జయహో జయచంద్రారెడ్డి విజయ ద్వానాలతో నీరాజనాలు**

బి.కొత్తకోట, మార్చి 10, ప్రభాతవార్త:
బి.కొత్తకోట మండల కేంద్రంలో ఆదివారం తెదేపా అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి జనసేన పార్టీ ఆద్వర్యంలో జరిగిన భారీ స్కూటరు ర్యాలీ వేలాది మందితో జ(య)న ప్రభంజనంగా మారి ఇసుక వేస్తే రాలనంతగా గతంలో ఏ రాజకీయ పార్టీకి దక్కని ప్రజాభిమానం జయచంద్రారెడ్డికి దక్కడం విశేషం. ఉదయం జయచంద్రారెడ్డి బి.కొత్తకోటలో జరగాల్సిన తెదేపా, జనసేన పార్టీల ఆత్మీయ సమ్మేలన సమావేశానికి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి మండల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకుల సారథ్యంలో వేలాదిగా కార్యకర్తలు తరలిరావడంతో బి.కొత్తకోట నగర పంచాయతీ జనసంద్రంగా మారి జయహో జయచంద్రారెడ్డి నినాదాలతో మారు మోగింది. జయచంద్రారెడ్డి బి.కొత్తకోటలో ప్రవేశించగానే వేలాదిగా కార్యకర్తలు నిలువెత్తు పూలమాలలతో ముంచెత్తి ఉక్కిరిబిక్కిరి చేశారు. సమావేశానికి తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులతో బి.కొత్తకోట పురవీధుల్లో భారీ స్కూటరు ర్యాలీ ప్రారంభించి వారిని ఉత్తేజ పరిచారు. కార్యకర్తలుచంద్రబాబునాయుడు నాయకత్వం వర్ధిల్లాలి, లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలి, పవన్ కల్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి, జయహో జై చంద్రారెడ్డి, బి.కొత్తకోట నగర పంచాయతీలోని వీదులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు.



భారీ బైక్ ర్యాలీతో వేలాదిగా వెంకటేశ్వర కల్యాణమండపంలో జరిగే ఆత్మీయ సభకు చేరుకున్నారు. బైక్ ర్యాలీ సందర్భంగా బి.కొత్తకోట నగర పంచాయతీ అశేష టీడీపీ, జనసేన జనవాహినితో స్తంభించిపోయింది. నా మీద నమ్మకంతో నన్ను గెలిపించండి టీడీపీ, జనసేనను రెండు కళ్లుగా చూసుకుంటానని జయ చంద్రారెడ్డి హామీ ఇచ్చారు. తంబళ్లపల్లె నియోజక వర్గానికి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తెదేపా అభ్యర్థిగా నా మీద నమ్మకంతో నన్ను గెలిపించండి భవిష్యత్తులో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలను రెండు కళ్లుగా కాపాడుకుంటానని సభాముఖంగా ఆయన హర్షధ్వానాల మధ్య హామీ ఇచ్చారు. చివరిగా జయచంద్రారెడ్డి ఆత్మీయ సభకు హాజరైన వేలాది మంది నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

## చిన్నారి కుటుంబానికి ఆర్థిక సహాయం



చాపాడు, మార్చి 10, ప్రభాతవార్త:
మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని తిమ్మాయిపల్లె గ్రామానికి చెందిన ముస్లిం, మైనార్టీకి చెందిన ఖతాల్ గారి రెహాన కుమార్తె హర్షితకు ఇటీవల ప్రమాదవశాత్తు ఇంటి గోడ మీద పడటంతో కాలికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి నందు చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన కుటుంబానికి ఆర్థిక పరిస్థితి ఇబ్బంది కరంగా ఉండటంతో కడప జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి 10వేలు ఆ గ్రామ సర్పంచ్ రహమతుల్లా, వైస్ సర్పంచ్నాగన్న చేతులమీదుగా కుటుంబ సభ్యులకు అందజేసినట్లు మునిశేఖర్ రెడ్డి తెలిపారు.

# జేమ్స్ స్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

కడప లీగల్, మార్చి 10, ప్రభాతవార్త: కడప నగరం చిలకలబావి వద్ద గల జేమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆదివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం, సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫక్రుద్దీన్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం-2015 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మిస్టర్ సత్తార్ సామిర్ రిజిస్టర్ అబ్దుల్ హక్ యూనివర్సిటీ, మిస్టర్ ప్రసాద్ ఆర్టీఏ డిపార్ట్మెంట్, మిస్టర్ గులాం తారిక్ రిజిస్టర్ వైవీయూ, డా.అబిద్ హుసేన్ ఛైర్మన్ ఎంఎం ఆసుపత్రి, జేమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలు కరస్పాండెంట్ మదర్ అలీఖాన్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తెలుగుదేశంలో రూపానందం..

**- నేడు కోడూరుకు రాక- స్వాగత ఏర్పాట్లలో అభిమాన అనుచర గనం**

ఓబులవారిపల్లె, మార్చి 10, ప్రభాతవార్త: రైల్వేకోడూరులో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ముక్కా రూపానందరెడ్డికి టీడీపీ నియోజకవర్గ ఇన్ఛార్జి బాధ్యతలు ఇచ్చిన నేపథ్యంలో పెను మార్పులు చోటు చేసుకోను న్నాయి.తెలుగుదేశంబలంఅనూహ్యంగా పెరగనుం ది. హైదరాబాదు కేంద్రంగా రూపానందరెడ్డి రాజకీయ చాణక్యుడిగా తన మార్కు వ్యూహం రచించారు. ఈ వ్యూహం ఫలిస్తోంది. టీడీపీకి పూర్వ వైభవం దిశగా అడుగులు వేగం పుంజుకున్నాయి. తెదేపా ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచుకోటగా ఉన్న కోడూరు 2004 నుంచి వరుస ఓటములు చవిచూసింది. కర్షుడి చావుకు కారణాలు అనేకమన్నట్లు టీడీపీలోని అనైక్యత విపక్ష పార్టీ విజయానికి దోహద పడింది.

## రూపానంద సమక్షంలో పలువురు టీడీపీలోకి..

ఓబులవారిపల్లె, మార్చి 10, ప్రభాతవార్త: అధికార పార్టీలో అసంతృప్తిగా ఉన్న గ్రామ స్థాయి కార్యకర్తలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఒక మండలాధ్యక్షుడు రూపానందరెడ్డి ద్వారా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మరో ఇద్దరు దేశం గూటికి రావడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. చిట్వేలి మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి రూపానందరెడ్డిసమక్షంలో కండువా వేసుకున్నారు.



ఓబులవారిపల్లె మండలంలోని పెద్దఓరంపాడు, గోవిందంపల్లి, బొమ్మవరం, మంగంపేట, చిన్నంపల్లి, చిన్న ఓరంపాడు, వై.కోట, జీవీ పురం పంచాయతీల్లో వలసలు పెరిగే అవకాశాలున్నాయి. కోడూరు మండలంలోని ఓబనపల్లె, రాఘవరాజపురం, బొజ్జావారిపల్లె, ఉర్లగట్టుపోడు, కె.బుడుగుంటపల్లి, నారాయణరాజుపోడు, మైసూరువారిపల్లి, వెంకటరెడ్డిపల్లి, తిమ్మిశెట్టిపల్లి, కంద్రిక, ఉప్పరపల్లి గ్రామాల్లో కీలక నేతలు టీడీపీలో చేరనున్నట్లు గుసగుసలు వినపడుతున్నాయి. పెనగలూరు మండలంలో కట్టవారిపల్లి, ఈటిమూర్పురం, ఓబిలి, నల్లపురెడ్డిపల్లి, పొందలూరు తదితర గ్రామాల్లో గ్రామ స్థాయి కార్యకర్తలను సంపాదించినట్లు తెలిసింది. పుల్లంపేట మండలంలో కొమ్మనవారిపల్లి, దొండ్లోపల్లి, అనంతంపల్లి, రంగంపల్లి, టి.కమ్మపల్లి, దళవాయిపల్లి, పుల్లంపేట, పీవీజీ పల్లి గ్రామాల్లో వలసలు ఉండొచ్చని ప్రచారం ఉంది. చిట్వేలి మండలంలో మాలెమూర్పురం, రాజుకుంట, దేవమాచుపల్లి, అగ్రహారం, తిమ్మాయపాలెం, తుమ్మకొండ నేతివారిపల్లి, మార్గోపల్లి, పొల్లోపల్లి, మైలపల్లి గ్రామాల్లో రూపానందరెడ్డి వెంట టీడీపీలోకి వస్తున్నారు. అదే జరిగితే 2024 కోడూరులో తెదేపా గెలుపు నల్లేరుపై నడకే అవుతుందని విశ్లేషకుల భావన. రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా చేసిన దాన ధర్మాలు అదనంగా కలిసొచ్చే అంశాలు. తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు ఇప్పటికే దిశా నిర్దేశం చేయడం జనసేన శ్రేణులు బలంగా ఉండడం శుభ పరిణామమని ధీమాగా ఉన్నారు.

# ఏపీఎన్ఆర్టీఎస్ సేవలు ప్రశంసనీయం



కడప కార్పొరేషన్, మార్చి 10, ప్రభాతవార్త: ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఎన్ఆర్టీఎస్ సహకారాలు అందిస్తోందని వైసీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బీహెచ్ అన్నారు. కరోనా సమయంలో పూర్తి సహకారాలు అందించిందని కొనియాడారు. 40 సంవత్సరాలకు పైగా సుధీర్ఘ రాజకీయ అనుభవం, 14 ఏళ్ల సీఎంగా అనుభవం, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా అనుభవం ఉందని తనకు తానే గొప్పలు చెప్పుకునే చంద్రబాబునాయుడు జగన్ ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. వైసీపీకి ఉన్న ఓటింగ్ శాతం తగ్గించడానికి కుటిల యత్నాలు, నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఖతర్లోని తాజ్ మహరాజా రెస్టారెంట్లో ఖతార్ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు తన అమ్ములపొదిలో ఉన్న అన్ని అస్త్రాలు ఉపయోగిస్తున్నారని ఎద్దేవా చేశారు. జనసేనతో పొత్తు పెట్టుకొని పాత పరిచయాలతో మోసురుపల్లి షర్మిల కాంగ్రెస్ అధ్యక్షురాలు కావడం తద్వారా అధికార పార్టీ వైసీపీకి 10 శాతం ఓట్లు తగ్గించే దురుద్దేశంతో చంద్రబాబు ప్రయత్నించారని ఆరోపించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్నాడు. చంద్రబాబు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజల ఆశీర్వాదం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం రెండో సారి వై.ఎస్.జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు నాగరాజు, ఖతార్ కన్వీనర్ శశికిరణ్, గల్ఫ్ అడ్వైజర్ వర్జిల్ బాబు, కోకన్వీనర్ జాఫర్ హుసేన్, దోహ ఖతార్ సీనియర్ నాయకులు వర్దనపు ప్రకాష్బాబు, కోకన్వీనర్లు మనీష్రెడ్డి, కె.లక్ష్మయ్య, మోహన్రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం



ప్రొద్దుటూరు, మార్చి 10, ప్రభాతవార్త:
ప్రొద్దుటూరు టిడిపి ఇన్చార్జ్ ప్రవీణ్కుమార్ రెడ్డి సోదరి జి.హరితా రెడ్డి కుమారుడు కె.లిఖిత్ సుందర్ రెడ్డి 16వ పుట్టినరోజు సంధర్భంగా స్థానిక మధర్ థెరిస్సా సేవా వృద్ధాశ్రమలో
వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా శూలం బాలరాజు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులకు ఆర్భాటాలు లేకుండా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం
నిర్వహించడం చాలా మంచిదని అన్నారు. ఈ కార్యక్రమంలో శూలం లక్ష్మిదేవి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెనగలూరులో రెవెన్యూ భూ రికార్డులు గోల్మాల్

**- అధికారులు అండగా కబ్జాలు దండి**

ఓబులవారిపల్లె, మార్చి 10, ప్రభాతవార్త: రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనమలూరు మండలంలో రెవెన్యూ అధికారుల అండదండలతో కొందరు బడా బాబులకు భూములు దోచిపెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూ రికార్డులు బయటకు తీసుకెళ్లి భారీగా టాంపరింగ్ చేసి రికార్డులు గోల్మాల్ చేశారని విశ్వసనీయ సమాచారం. ఎలకచర్ల తదితర పంచాయతీల్లో వందల ఎకరాలు భూములను కబ్జా చేసి అధికారుల అండదండలతో కొంత మంది బడా బాబులకు సహకరించి అప్పనంగా ప్రభుత్వ భూములు కబ్జా చేసి ఆక్రమిస్తుంటే వారికి సహాయ సహకారాలు అందిస్తూ ఇంటి దొంగలు సహకరిస్తున్నారన్న విమర్శలు గుప్పిస్తున్నాయి. సెంటు భూమి లేని నిరుపేదలు ఎక్కడైనా ఒక ఎకరా సాగు చేసుకుంటే సవాలక్ష ప్రశ్నలు, నిబంధనలుంటాయని ఇక్కడ పెత్తందారీ వ్యవస్థ చాప కింద నీరులా సాగుతూ ప్రభుత్వ భూములు కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోతుంటే అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తు బడా బాబులకు భూ కబ్జాదారులకు దోచిపెడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు, జిల్లా కలెక్టరు లోతైన విచారణ చేపట్టి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు, కమ్యూనిస్టు నాయకులు తదితరులు జిల్లా అధికారులు కోరుతున్నారు.

# టీడీపీ అభిమాని వెంకటస్వామి మృతికి శ్రద్ధాంజలి

తంబళ్లపల్లె, మార్చి 10, ప్రభాతవార్త: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లి పంచాయతీ సింగారెడ్డిగారిపల్లెకు చెందిన తెదేపా వీరాభిమాని పూజారి వెంకట స్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం తెదేపా అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సింగారెడ్డిపల్లెకు చేరుకొని పూజారి వెంకట స్వామి భౌతికకాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వెంకట స్వామి కుమారుడు వెంకటరమణ, సుధాకర్లతో పాటు కుటుంబ సభ్యులు ఓదార్చి మీకు నేను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లి పంచాయతీ సింగారెడ్డిగారిపల్లెలో ఓ సీనియర్ తెదేపా కార్యకర్తను కోల్పోవడం విచారకరమని పార్టీకి ఆయన చేసిన సేవలు మరువరానివని కొనియాడారు. ఆయన వవెంట తంబళ్లపల్లె మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, కురబలకోట మండలాధ్యక్షుడు సురేంద్ర, మార్కిరి ఆంజనేయరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబోతోనే సాధ్యం

**టిడిపి ఇన్చార్జ్ జీవి ప్రవీణ్కుమార్ రెడ్డి**



ప్రొద్దుటూరు, మార్చి 10, ప్రభాతవార్త:
రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం తెలుగుదేశం పార్టీ చంద్రబాబుతోనే సాధ్యమని ప్రొద్దుటూరు టిడిపి ఇన్చార్జ్ జీవి ప్రవీణ్కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గోపవరంపంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురంలో నిర్వహించిన బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మార్తల సుబ్బారెడ్డి, మార్తల ప్రతాపరెడ్డి, పెద్దన్న, ఓబుల్రెడ్డి, అంగడి శ్రీనివాసులు, కిట్టు గంగా సుధాకర్యాదవ్, రమణాచారి, నాగరాజు ఆచారి, కృష్ణ యాదవ్,నరేష్, రామలింగ, శివ, గురు శేఖర్ రెడ్డి, గోపవరం గగ్గుటూరి గౌస్ మొహీద్దీన్, ప్రొద్దుటూరు మండల కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ బండి భాస్కర్రెడ్డి, బొమ్మినేని ప్రసాద్, అమృతనగర్ ఫయాజ్,సుబ్బరాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య, 41వ వార్డు శూలం శివప్రసాద్, పొట్టిపాడు గంగాధర్, 36వార్డు కృష్ణారెడ్డి, చెన్నంరాజు పల్లెనశ్యం వెంకటసుబ్బయ్య, ఉస్మాన్, పూల వెంకటేష్, చారి, కమాల్బాష, పెంచల్ రెడ్డి మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మీ చిన్నారి భవిష్యత్తు కోసం నన్ను ఆదరించండి

**- దాసరిపల్లి జయచంద్రారెడ్డి**



బి.కొత్తకోట, మార్చి 10, ప్రభాతవార్త: వైకాపా పాలనలో రైతులకు వ్యవసాయం లేదు, కూలీలకు ఉపాధి లేదు, విద్య అంతంత మాత్రమే. ఉద్యోగాలు లేవు ఇలా అన్ని రంగాల్లో వెనకబడిందని చిన్నారుల భవిష్యత్తు కోసం తెదేపాను ఆదరించి నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మా అధినేత చంద్రబాబు సూచనలతో తంబళ్లపల్లె అభివృద్ధితో పాటు భావితరాలకు అభివృద్ధి బాటలు వేస్తానని టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి రైతులను కోరారు. ఆదివారం బి.కొత్తకోట మండలం గొల్లపల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు ఉదయకుమార్, పావని దంపతుల కుమార్తె విందశ్రీ జన్మదిన సందర్భంగా ఆ చిన్నారిని మనస్ఫూర్తిగాగా ఆశీర్వదించారు. ఆయన వెంట మర్కిరి ఆంజనేయరెడ్డి, తెదేపా, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బుగ్గవంక నిరుపేదలకు ఆశ్రయం కల్పించడంలో ప్రభుత్వం విఫలం

**- శ్రీనివాసరెడ్డి, మాధవిరెడ్డి, ఆమూరి బాలదాసు**



కడప వైద్యవిభాగం, మార్చి 10, ప్రభాతవార్త: నగరంలోని బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లో నివసించే నిరుపేద మైనార్టీ కుటుంబాలకు ఆశ్రయం కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవిరెడ్డి, తెదేపా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసులు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ మంత్రి అంజాద్ బాషా ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు మాసాపేట శంకరన్న, శ్రీనివాసులు, నాగమునయ్య, బీసీ నాయకులు కుమ్మర సాంబశివయ్య, మల్లికార్జున, హనీఫ్, మహేష్, చంద్ర నాగరాజు యాదవ్, ప్రసాద్, నాదెళ్ల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాలదాసు గృహంలో ఇచ్చిన విందులో పాల్గొన్నారు.

# స్వార్థ రాజకీయ ప్రయోజనాలకై చంద్రబాబె బిజెపితో పొత్తులు అక్రమ పొత్తులకు ఓటుతోనే బుద్ధి చెప్పనున్న ప్రజలు

**ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి**



ప్రొద్దుటూరు, మార్చి 10, ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎలాంటి ప్రయోజనాలను ఆశించి చంద్రబాబు బిజెపితో పొత్తు పెట్టుకున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారంఎన్నికల ప్రచారం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిజెపి పొత్తుతో రాష్ట్రానికి ఏ ప్రయోజనం చేకూరుతుందో స్పష్టం చేయాలన్నారు. పోలవరం నిర్మాణం కోసమా, విశాఖ అభివృద్ధి కోసమా, ప్రత్యేక హోదా కోసమా, ప్రత్యేక ప్యాకేజీ కోసమా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధుల కోసమా దేనికోసం బిజెపితో పొత్తు పెట్టుకున్నారో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. గతంలో అంటగాగిన చంద్రబాబు ధర్మ పోరాటం పేరుతో బిజెపి ఈ రాష్ట్రాన్ని నాశనం చేసిందని, నరేంద్ర మోడిని రాష్ట్రంలో అడుగుపెట్టనివ్వనన్న చంద్రబాబు వ్యాఖ్యలను ఆయన గుర్తుచేశారు. అంతేకాకుండా రాష్ట్ర పర్యటనకు వచ్చిన అమిత్ షా పై టిడిపి అల్లరి మూకలతో రాళ్ల దాడి చేసిన వైనాన్ని గుర్తు చేశారు. అలాంటి బిజెపితో తిరిగి ఎన్నికల సమయంలో పొత్తు పెట్టుకోవడం కేవలం స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసమేనని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఉనికి కోసం తన కొడుకులోకేష్ రాజకీయ భవిష్యత్తు కోసమే ఇలాంటి పొత్తులు చంద్రబాబుకు అలవాటేనన్నారు. రాష్ట్రం రెండు ముక్కలు కావడానికి కాంగ్రెస్ కారణం అయితే బిజెపి రాష్ట్ర ప్రజలను పేదరికంలోకి నెట్టిందన్నారు. అలాంటి బిజెపితోజగన్పై కక్ష తీర్చుకోవడం అధికార దాహం కోసమే చంద్రబాబు పొత్తులు పెట్టుకున్నారని విమర్శించారు. ఎంతమంది పొత్తులు పెట్టుకొని బరిలోకి వచ్చిన ప్రజలు జగన్వైపే ఉన్నారని రాబోయే ఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి145సీట్లు కట్టబెడతారని టిడిపికి కేవలం 30సీట్లతోనే సరి పెడతారని జోష్యం చెప్పారు. ఏదిఏమైనా రాష్ట్రంలో ఎలాంటి ప్రయోజనాల కోసం బిజెపితో పొత్తులు పెట్టుకున్నారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యతచంద్రబాబుపై ఉందన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ వడ్ల ఖలీల్, వైసిపి నాయకులు వడ్ల దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల చూపు కాంగ్రెస్ వైపు..- డా.నర్రెడ్డి తులసిరెడ్డి



కడప వైద్యవిభాగం, మార్చి 10, ప్రభాతవార్త: రాష్ట్రంలో మైనార్టీలందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని కాంగ్రెస్ పాలనలో మాత్రమే మైనార్టీలకు భద్రత, రక్షణ ఉంటాయని మైనార్టీలు నమ్ముతున్నారని 20 ఉూత్రాల మాజీ ఛైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డా.నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం కడప రవీంద్రనగర్లోని యుఐ కల్యాణ మండపంలో దలాజక్ బద్రుద్దీన్ ఖాన్ మరియు పలువురు మైనార్టీలు తులసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం మొదలుకొని అనేక మైనార్టీ వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నదని, మైనార్టీలు అభద్రతాభావంలో ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు. దేశం, రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే అది ఒక్క కాంగ్రెస్ పార్టీ వల్లనే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యతో ఉజ్వల భవిష్యత్తు

**- మాజీ మంత్రి హాజీ అహ్మదుల్లా, సంఘ సేవకులు సలావుద్దీన్**



కడప వైద్యవిభాగం, మార్చి 10, ప్రభాతవార్త: తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, క్రమశిక్షణపై దృష్టి పెట్టాలని అప్పుడే పిల్లల ఉజ్వల భవిష్యత్తు సాధ్యపడుతుందని మాజీ మంత్రి హాజీ అహ్మదుల్లా పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కడప నగరం రవీంద్రనగర్లోని మదరస ఫైజే అబ్రార్ 20వ వార్షికోత్సవం సభను బుఖారియ మసీదులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి హాజీ మహ్మద్ అహ్మదుల్లా మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సయ్యద్ హమీద్ మరియు సయ్యద్ బషీర్ సోదరులు మదరస ఫైజే అబ్రార్ ద్వారా వేల మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా అరబిక్, ఉర్దూ భాషలలో విద్యా బోధన అందిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అరబిక్ పండితులు హఫీజ్ షానవాజ్, హఫీజ్ జైనుల్ అబిదీన్, హఫీజ్ ఖాదర్ బాషా, హఫీజ్ అబ్దుల్ గఫార్, హఫీజ్ ఉబేదుల్లా, నాయకులు విష్ణుప్రీతంరెడ్డి, అబు తలహా, రహమతుల్లాఖాన్, ముహమ్మద్ షఫీ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కారు-స్కూటరు ఢీ - వృద్ధుడు మృతి

రామాపురం, మార్చి 10, ప్రభాతవార్త: కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ బీసీ కాలనీ ఇటుకల ప్యాక్టరీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు, టీవీఎస్ స్కూటరును ఢీకొని స్కూటరిస్టు గునిశెట్టి నారాయణ(60) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయచోటి పట్టణం మాసాపేట గ్రామం రెడ్డివారిపల్లికి చెందిన బేల్దారి గునిశెట్టి నారాయణ తన సమీప బంధువులు రామాపురం మండలం నల్లగుట్టపల్లి గ్రామంలోనికొత్తపల్లిలో గంగమ్మ జాతరకు బోనాలు పెడుతుంటే బంధువుల పిలుపు మేరకు ఇంటి వద్ద నుంచి టీవీఎస్ స్కూటర్లో రామాపురం వచ్చి తిరిగి నల్లగుట్టపల్లి కొత్తపల్లికి వెళ్లడానికి క్రాస్ అవుతుండగా రాయచోటి వైపు నుంచి కడప వైపు వెల్తున్న కారు ఢీకొనడంతో నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని చికిత్స నిమిత్తం 108 వాహనంలో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని భార్యబిడ్డలకు అప్పజెప్పి వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.ఎల్.ప్రసాద్రెడ్డి తెలిపారు.

# ఒంటిపూట బడులు వెంటనే ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్, మార్చి 10, ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎండ తీవ్రత విపరీతంగా పెరుగుతూ ఉన్నందున పాఠశాలలకు ఈనెల 12 నుంచి ఒంటిపూట బడులు ప్రకటించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగల్రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు అలీఖాన్, ఈశ్వరచంద్రులు డిమాండ్ చేశారు. ఎండ తీవ్రత విపరీతంగా పెరుగుతూ ఉన్నందున పిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఎండ తీవ్రతతో వడ దెబ్బ తగిలే అవకాశం ఉందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఒంటిపూట బడులు ప్రకటించాలని కోరారు. 10వ తరగతి పరీక్ష కేంద్రాలున్న పాఠశాలల్లో ఉదయం 7 నుంచి 9 వరకు తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే మాదిరిగా 220 పని దినాలు పూర్తవుతున్నందున వేసవి సెలవులను సైతం ఏప్రిల్ 24 నుంచి ప్రకటించాలని కోరారు.

# అమృత నగర్లో 300కుటుంబాలు వైసిపిలో చేరిక

ప్రొద్దుటూరు, మార్చి 10, ప్రభాతవార్త: ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని అమృతనగర్-2లో వైసిపి నాయకులు బాబావల్లి ఆధ్వర్యంలో సుమారు 300కుటుంబాలు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిసమక్షంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు వారిని సాదారంగా ఆహ్వానిస్తూ వైసిపి కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్శితులై జగన్కు తోడుగా నిలవాలని అమృతనగర్లోని యువకులు వైకాపాలో చేరడం అభినందనీయమన్నారు. ఈ సంధర్భంగా వారికిసాదర స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్దిని వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని భావిస్తేనే ఫ్యాన్గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మేలు జరగలేదని భావిస్తే తిరస్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సానబోయిన శేఖర్యాదవ్, కౌన్సిలర్ వరికూటి ఓబుల్రెడ్డి, వైసిపి మండల కన్వీనర్మార్తల ఓబులరెడ్డి, వైసిపి నాయకులు సూర్యానారాయణ రెడ్డి, కొత్తపల్లె పంచయతీ వార్డు మెంబర్లు లక్ష్మి నారాయణరెడ్డి, హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రి బాయి-జెవివి

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 10, ప్రభాతవార్త: మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి అని, తాను చదవడమే కాకుండా తొలి మహిళా ఉపాధ్యాయురాలు అయ్యి అనేకమంది మహిళలను విద్యావంతులను చేసిన ఘనతసావిత్రిబాయిదేనని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం, సావిత్రిబాయి వర్ధంతి సంధర్భంగా "నేనూ ..సావిత్రిబాయిని" అనే పుస్తకావిష్కరణను చేశారు.



## మహిళా లోకానికి ఆదర్శం సావిత్రిబాయి పూలే

కడప ఎడ్యుకేషన్, మార్చి 10, ప్రభాతవార్త: విద్యార్థినీ మహిళా లోకానికి సావిత్రీ బాయి పూలే ఆదర్శమని పీడీఎస్యూ ఆధ్వర్యంలో 127వ వర్ధంతి వేడుకలు ఈ కార్యక్రమంలో పీడీఎస్యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ యాదవ్, అన్నమయ్య జిల్లా పీడీఎస్యూ నాయకుడు స్వరూప్ తేజ, మదన్మోహన్, వెంకటేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కురబల ఆరోగ్య దైవం బీరప్ప స్వామి ఉత్సవం

కలికిరి, మార్చి 10, ప్రభాతవార్త: కురబ కులస్థుల ఆరోగ్య దేవుడు బీరప్ప స్వామి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. స్థానిక మండలంలోని పత్తేగడ గ్రామ పంచాయతీ పాలెం కురువపల్లి నందు బీరప్ప స్వామి భక్తులు, నారాయణ, కృష్ణమూర్తి ఆద్వర్యంలో గత రెండు రోజులుగా శివరాత్రి పురస్కరించుకొని ప్రతి ఏటా చేసే ఉత్సవంలో భాగంగా శనివారం రాత్రి బీరప్ప స్వామిని మేల్కొలిపి ఉత్సవ విగ్రహాలతో పాటు ఊరంతా మెరవని తీసి భక్తిశ్రద్ధలతో కోలాటాలతో చెక్క బజనలతో,కత్తుల ఆటలతో ప్రతి కుటుంబ కులస్థుడు ఏకమై అంగరంగ వైభవంగా ఉత్సవాన్ని ముగించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి బక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని కార్యనిర్వాహకులు బీరయ్య, భాస్కర, బాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కురభ కులస్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# తెదేపా ఘన విజయం మనందరి నినాదం

**- టీడీపీ రాష్ట్రష కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి**

తంబళ్లపల్లె, మార్చి 10, ప్రభాతవార్త:
తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అభ్యర్థి ఎవరైనా తెదేపా ఘన విజయమే మనందరి నినాదం కావాలని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి ఉత్తేజపరిచారు. ఆదివారం ఆయన స్వగృహంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ, జనసేన మండల స్థాయి, ద్వితీయ శ్రేణి నాయకులు, సీనియర్ నాయకులతో ఆతత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో పార్టీ అధినేత తీసుకున్న నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండి ఈ వైకాపా ఎమ్మెల్యే అరాచకాలు, దౌర్జన్యాలు,



భూకబ్జాలు, సహజ వనరుల దోపిడీ నుంచి తంబళ్లపల్లెను కాపాడుకోలేకపోతే ప్రజాస్వామ్యం మంట కలిసి పోతుందన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తను అధినేత చంద్రబాబు, రాష్ట్ర నాయకుడు నల్లారి కిశోర్కుమా ర్రెడ్డిల సహకారంతో ఆదుకుంటానని హామీ ఇచ్చారు. తంబళ్లపల్లె టికెట్ విషయంలో బేషజాలకు వెళ్లకుండా అధినేత ఇచ్చిన ఆదేశాలే శిరోధార్యంగా ఆయన వెంట నడిచి తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకోవడమే మన కర్తవ్యమని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కొండ్రెడ్డి ఇచ్చిన ప్రటకనకు తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి హాజరై వందలాది మంది నాయకులు కరతాళ ధ్వనులతో స్పందించి సంఘీభావం తెలిపి తెదేపా గెలుపు కోసం నీ వెంటే మేము నడుస్తామని ముందుండి నాయకుడివై నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల సీనియర్ టీడీపీ నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగ్ వివాదంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై దాడి
### తాలూకా పోలీసులకు ఫిర్యాదు



మదనపల్లెక్రైం, మార్చి 10 ప్రభాతవార్త : క్రికెట్ బెట్టింగ్ గొడవలో భాగంగా ఇరువర్గాలకూ సర్దిచెబుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై ఓ వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు ఇటుకురాళ్ళతో మూకుమ్మడిగా దాడిచేసి గాయపరిచారు. ఈ సంఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. మండలంలోని చిప్పిలి గ్రామానికి చెందిన పసుపులేటి చిన్నప్ప కుమారుడు పి.అరుణకుమార్(24)బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఈ నేపధ్యంలో శివరాత్రి పండగ కోసం రెండు రోజుల క్రితం ఊరికి వచ్చాడు. అయితే ఆదివారం మండలంలోని ఇసుక నూతనపల్లెకు చెందిన కుమార్, ఇతని కొడుకులు వరణ్, ఉమా మరికొందరు కలసి చిప్పిలికి చెందిన జీవన్‌తో క్రికెట్ బెట్టింగ్ విషయమై గొడవ పెట్టుకొన్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారు మాటా మాట పెంచుకొని ఘర్షణ పడుతుండగా అరుణ్‌కుమార్ జోక్యం చేసుకొని సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో ఆవేశానికి గురైన కుమార్, వరుణ్, ఉమా, వీరి స్నేహితులు విష్ణు, టెంపర్‌గణి, మరికొందరు కలసి ఇటుకురాళ్ళతో అరుణ్‌కుమార్‌పై మూకుమ్మడిగా దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితుని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అరుణ్ ఘటనపై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు చెప్పారు.

## కడవలితో నరికితే హత్యాయత్నం కాదా పోలీసులు న్యాయం చేయలేదని బాదితులు ఆరోపణ



మదనపల్లెక్రైం, మార్చి 10 ప్రభాతవార్త : కొడవలితో నరికితే హత్యాయత్నం కాదా అంటూ బాధితులు విలేకర్ల ముందు వాపోయారు. పోలీసులు నిందితులకు ఒత్తాసు పలుకుతున్నారని మాకు న్యాయం చేడం లేదంటూ పీలేరు నియోజకవర్గం వాయల్పాడు మండలం ఎర్రగుంట్లబావి గ్రామానికి చెందిన మండ్ల శివ తండ్రి శ్రీనివాసులు తల్లి నాగరత్నాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బాధితులు పట్టణంలోని విషన్‌కాంపౌండు నందు విలేకరులతో వారు గోడు వెల్లబోసుకొన్నారు. ఎర్రగుంట్లబావికి చెందిన పి.హరీష్, పి.పవన్, పి.రవీంద్ర, పి.కిషోర్, పి.సురేంద్ర, జె.నాగేంద్ర, జె.నరసింహులు, పి.బాబు, పి.నారాయణలు మూకుమ్మడిగా వచ్చి కొడవలితో నరికి తీవ్ర గాయాలు చేశారు. గత 15ఏళ్ళుగా మాపై కక్షకట్టి ఆర్థిక బలంతనో పోలీసులు అక్రమ కేసులు కట్టి వేదిస్తున్నారన్నారు. వ్యవసాయ పొలం వద్ద వైర్లు, స్టార్టర్ మోటార్, చోరీల అక్రమ కేసులతో పలుమార్లు వేధించారు. పాత కక్షలతో మనసులో పెట్టుకొని మరోసారి మాపై వారందనరూ ఏకమై దాడిచేసి గాయపరిచారు. ప్రాణభయంతో వాయల్పాడు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి చికిత్సలు తీసుకొన్నాం. అనంతరం శనివారం రాయచోటిలోని ఎస్‌పి కార్యాలయానికి వెళ్ళి బాధితులపై ఫిర్యాదు చేశామన్నారు. వాయల్పాడు సిఐ, ఎస్ఐలు నిందితులకే ఒత్తాసు పలుకుతున్నారని బాధితులు తెలిపారు. పై వారి నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాల్సిన పోలీసులు నిందితులకే ఒత్తాసు పలుకుతు ఒడడంతోకన్నీముమున్నీరుగా విలపించారు. మాకు న్యాయం చేసే దిక్కెవరు అంటూ లబోదిబోమన్నారు.

# రాయచోటిని అభివృద్ధిలో నెంబర్ వన్ చేయడమే ధ్యేయం

- అభివృద్ధికి పట్టం కట్టండి మరోమారు వైసిపిని ఆశీర్వదించండి
- నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్నా - ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి
- టిడిపి నుండి వైసిపిలోకి 50 కుటుంబాలు చేరిక



రాయచోటి, మార్చి 10, ప్రభాత వార్త : రాయచోటిని అభివృద్ధిలో నెంబర్ వన్‌గా చేయడమే ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని నాజ్‌హాల్ సమీపంలో షాకీర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో టిడిపి నుండి 50 కుటుంబాలు వైఎస్ఆర్‌సిపి పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయచోటి పట్టణం అభివృద్ధిలో ముందు ఎలా ఉంది ఇప్పుడెలా ఉందో ప్రజలు ఆలోచించాలన్నారు. నాయకుడంటే బాధ్యతగా పని చేయాలన్నారు. పట్టణంలో బస్‌స్టాండు, వందపడకల ఆసుపత్రి, రైతు బజార్, డైట్ మున్సిపల్ ఫార్కు, నగరవనం, శిల్పారామం, త్వరలో రూ. 190 కోట్ల నిధులతో పిజి కేంద్రం ఆపై యూనివర్సిటీగా అభివృద్ధి, రూ. 100 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణపు పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. వైఎస్ఆర్ స్ఫూర్తితో జగన్ పాలన అందిస్తున్నారన్నారు. జిల్లా కేంద్రం ఏర్పాటుతో రాయచోటికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. రాయచోటిలో రౌడీయిజం, గుండాయిజం, భూముల కబ్జా, అక్రమ సివిల్ షెటిల్‌మెంట్లు తదితర అన్యాయాలను పూర్తిగా అరికట్టి పట్టణాన్ని శాంతికి నిలయంగా అభివృద్ధికి చిరునామాగా మార్చామన్నారు. తాను అన్యాయాల జోలికి వెళ్లలేదని, వెళ్లనని స్పష్టం చేశారు. మనందరి గుర్తు ఫ్యాను గుర్తి అని, ప్రజల కోసం అనునిత్యం కృషి చేస్తున్న జగన్‌ను మరోసారి సిఎంను చేసేందుకు ప్రజలందరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి పట్టం కట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, జడ్పిటిసి వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్ షబ్బీర్, మాజీ కో ఆప్షన్ జాఫర్ అలీఖాన్, మాజీ జడ్పిటిసి హసన్‌బాష, పార్టీ పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, ఆసీఫ్ అలి ఖాన్, గౌస్‌ఖాన్, మురికినాటి వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీల స్కీమ్‌లను రద్దుచేసిన వైకాపా ప్రభుత్వం
### జగన్ ను సాగనంపడానికి జనం సిద్దం..జాతీయనేత నల్లారి



పీలేరు, మార్చి 10 ప్రభాతవార్తః జగన్‌మోహన్‌రెడ్డి కేవలం సీఎం పదవి కోసం దళితులను కేవలం ఓటు బ్యాంకుకే పరిమితం చేసి దళితుల జీవితాలతో ఆటలాడుకున్నారని తెదేపా జాతీయనేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాలంవారిపల్లె గ్రామం, మొరవపల్లె , దుబ్బాహరిజనవాడ కాలనీ, కురవపల్లె, బాలంవారిపల్లె, తూగుంటపల్లె, ఒంటేరువాండ్లపల్లె, దేసిరెడ్డిగారిపల్లె, గురమాళ్ళపల్లె, నూనెవాండ్లపల్లె, తదితర గ్రామాల్లో బాబుషూరిటీభవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టి తెదేపా, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో పొందు పరచిన పథకాలు ప్రజలకు వివరించారు. వైఎస్సార్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ కార్పొరేషన్ లోన్లను నిర్వీర్యం చేసి 27 స్కీములను రద్దుచేసిన దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడానికి జనం సిద్దంగా ఉన్నారన్నారు. ఐదేళ్ల కాలంలో ఈవైసీపీ ప్రభుత్వంలో చాలామంది దళితులు అభాగ్యులైయ్యారు. చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కష్టజీవులైన పేదలకు ఈరాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. గోరంత మన మంచి లాక్కుంది కొండంత. ఈప్రభుత్వంలో నిత్యావసర దరలకు పన్నుల పోట్లకు కరెంటు చార్జీల మోతలకు బలైపోయామన్నారు. ప్రతి ఒక్కరు గమనంచి ఒక్క ఛాన్సు మాయతో మనకు జరిగిన అన్యాయాన్ని మరోసారి జరగకుండా జాగ్రత్త పడదాం. మాయమాటల ముఠా ఓట్లకోసం మళ్లీ గ్రామాలలోకి వాడలలోకి బయలుదేరాయి. దుర్మార్గపు వైసీపీ పార్టీకి రేపు జరిగే ఎన్నికలలో ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ది చెబుదామన్నారు. ఈకార్యక్రమంలో తెదేపా, జనసేన నాయకులు కార్యకర్తలు అనుబంధ సంఘాలు నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

## ఆవణి క్షేత్రం జనసంద్రం



రామసముద్రం, మార్చి 10 ప్రభాతవార్త :మండల సమీపాన కర్నాటక బార్డర్‌లో రామలింగేశ్వర స్వామి రథోత్సవంను తిలకించడానికి తరలివచ్చినలక్షలాది మంది భక్తులతో ఆవణి క్షేత్రం జనసంద్రమే అయ్యింది. పురవీదుల్లో మార్మోగాయి. ఆవణి గ్రామ పెద్దలు, ఆవణిరాజు క్షత్రియ వంశస్థులు రథోత్సవంను పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకొన్నారు. కార్యక్రమంలో మండల నుంచి ప్రముఖులు, రాజకీయ నాయకులు ఆవణి మాజీ ఛైర్మెన్ విజయకుమార్, రవిబాబు, సుబ్బారాజు, హరినాత్, సత్యనారాయణరాజు దామోదర్‌రెడ్డి, వెంకటేష్‌రాజు, నవీన్ తమన్న, చంద్రు, హరి పాల్గొని రథోత్సవాన్ని తలికించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కల్లుపల్లె ప్రకాష్ సుమారు లక్షమంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## అభాగ్యుల కోసం ఆశ్రమం సిద్ధం

కాశినాయన,మార్చి 10,ప్రభాతవార్త: మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలో సగిలేరు నది ఒడ్డున ఉన్న వివేకనంద సేవాశ్రమం అభాగ్యులకు ఆశ్రయం కల్పించేందుకు సిద్దంగా ఉందని ఆశ్రమ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు.దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి,ఆదరణ లేక నిరాశ్రయులైన వారికి ఉచితంగానే అన్ని రకాల వసతులతో సేవలు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ప్రకృతి దగ్గరగా ప్రశాంతమైన వాతావరణంలో దాతల సాయంతో నిర్మించిన వివేకానంద సేవాశ్రమం నడవలేని వారికి సైతం సేవ చేస్తున్నామన్నారు.ఆశ్రమంలోచేరాలనుకునేవారు 8897292237 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలన్నారు.

## రాష్ట్రాభివృద్ధికే బిజెపితో కలయిక - చమర్తి జగన్‌మోహన్‌రాజు



రాయచోటి, మార్చి 10, ప్రభాత వార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసమే చంద్రబాబునాయుడు బిజెపితో పొత్తుకెళ్లారని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో ఎన్డిఎ ప్రభుత్వం ఏర్పడుతుందని, తద్వారా రాష్ట్ర ప్రయోజనాలు సాధించుకోవడానికి వీలవుతుందని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలియజేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో బిజెపితో పొత్తు ఉన్నప్పటికీ చంద్రబాబు సారధ్యంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందాయని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఓట్లు వేసిన అన్ని వర్గాలను నిర్లక్ష్యం చేసి వారిపైనే దాడులు చేసి రాష్ట్రంలో విధ్వంస పరిపాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్టపరిస్థితుల ఆధారంగా అధినేత చంద్రబాబునాయుడు పొత్తు నిర్ణయం తీసుకున్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ సంకల్పించిన మహాయజ్ఞానికి జనసేనతో పాటు బిజెపి కూడా కలిసివచ్చిందని, అరాచక వైపిపి ప్రభుత్వాన్ని గద్దెదించేందుకే మూడు పార్టీలు కలిసికట్టుగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్నాయని, తెలుగుదేశం పార్టీపై కేంద్రంలో బిజెపి పెద్దలకు కూడా నమ్మకం కలిగిందని, అందుకే కేంద్రం పొత్తులకు ఆహ్వానించిందన్నారు. చంద్రబాబునాయుడు దార్శనిక పాలన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రక్షగా ఉంటుందని, అతి పెద్ద జాతీయ పార్టీతో పాటు దేశం మొత్తం మాకు మద్దతిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ముస్తాక్ హుసేన్, గోరాన్‌చెరువు మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర భవిష్యత్తే టిడిపి లక్ష్యం
### పార్లమెంటరీ నేత ఆర్‌జె.వెంకటేష్



మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త : రాష్ట్ర భవిష్యత్తు కోసమే తెలుగుదేశం పార్టీ బిజెపితో పొత్తు పెట్టుకొందని రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ అన్నారు. గత ఐదేళ్ళ వైసిపి పాలనలో రాష్ట్రం 20సంవత్సరాలు వెనుకబడిందని రాష్ట్రం తిరిగి అభివృద్ధి చెందాలన్నా, భావితరాలు భవిష్యత్తు బాగుపడాలన్నా టిడిపి అధికారంలోకి రావడం చాలా అవసరం అన్నారు. బిజెపి పొత్తు విషయంలో అధికార పార్టీ వైసిపి చేస్తున్న ఆరోపణలు ప్రజలు ఎవరూ పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మైనార్టీల విషయంలో కూడా మోడీ ప్రధాని అయ్యాక ఎక్కడా అల్లర్లు జరగలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపిలను ఆదరించాలన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న వైకాపాకు బుద్ది చెప్పాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాషా, గండికోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపికి బ్రహ్మరథం పడుతున్న మైనార్టీలు
## - మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటిటౌన్, మార్చి 10, ప్రభాత వార్త : రాయచోటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ముస్లీం మైనార్టీ సోదరులు బ్రహ్మరథం పడుతున్నారని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. రాయచోటి పట్టణం 10,11 వార్డులలో ఆదివారం రాంప్రసాద్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 కుటుంబాలు వైసిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. సలీం రైల్‌మిల్‌లో తెలుగుయువత పట్టణ అధ్యక్షుడు ఇమామ్‌బాష, దస్తగిరి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరినట్లు రాంప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. ముస్లీం మైనార్టీ సోదరులు వైసిపి పార్టీకి ఓట్లు వేసి మోసపోయామని రాంప్రసాద్‌రెడ్డి ఎదుట వాపోయారు. 30 సంవత్సరాలుగా మండిపల్లి కుటుంబంతో మైనార్టీలకు ఆత్మీయ అనుబంధం ఉందని, తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కార్యకర్తలకు అండగా ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి అహర్నిశలు కృషి చేస్తానని రాంప్రసాద్‌రెడ్డి ఓటర్లకు భరోసా ఇచ్చారు. మైనార్టీలకు గతంలో ఉన్న సంక్షేమ పథకాలు అన్ని అమలు చేస్తుందని ఓటర్లకు తెలియజేశారు. వైసిపి పాలనలో ధరల పెరుగుదల, భూకబ్జాలు, ఇసుక, మట్టి మైనింగ్ మాఫియా చేసి నాయకులు విచ్చలవిడిగా కోట్లు దండుకున్నారని తెలియజేస్తూ పార్టీ శ్రేణులతో సుడిగాలి ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా ఒకవైపు బటన్ నొక్కుతూ ఒకవైపు ధరలను పెంచుతూ పేద ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. ఈ ప్రచారంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు ప్రచారంలో పాల్గొన్నారు.

## వగళ్ల తాండా విద్యార్థికి డాక్టరేట్ దక్కడంపై హర్షం



పీలేరు , మార్చి 10 ప్రభాతవార్తః కేవి.పల్లె మండలంలోని దిగువ వగళ్ల తాండాకు చెందిన బుక్కే దుప్పనాయక్ కుమారుడు బుక్కే రాజేంద్రనాయక్ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో టైటిల్, చిత్తూరు జిల్లా గిరిజనుల విజ్ఞానం- పరిశీలన, తెలుగు శాఖ విభాగం అధ్యక్షులు పరిశోదన అంశాన్ని పర్యవేక్షకులు ఆచార్యులు జే.అప్పారావు ఆంధ్ర విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సులర్ ప్రొఫెసర్ పీవిజీడి ప్రసాద్‌రెడ్డి చేతులు మీదుగా డాక్టరేటును స్వీకరించారు.

## కన్నులపండుగులా వాలీశ్వరస్వామి తేరు



రామసముద్రం, మార్చి 10 ప్రభాతవార్త : మండలంలోని ఆర్‌నడింపల్లె పంచాయితీ బలసముద్రం గ్రామం సమీపంలో ఉన్న శ్రీ వాలీశ్వరస్వామి దేవాలయం శివరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం తేరు ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహించి అర్చకులు లోకనాథం దీక్షితలు, కుమారుడు మణికంఠ దీక్షితలు తదితర అర్చకులు స్వామికి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ వేడుకలను చూడడానికి మండల ప్రజలే కాకుండా కర్నాటక భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకొన్నారు. జడ్పిటిసి రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా చెంబకూరుకు చెందిన కోవ క్రిష్ణమూర్తి, ఫైగడ్డకు చెందిన మాజీ సర్పంచ్ వాలీశ్వర ఆలయ దర్మకర్త దివంగత వాలిరెడ్డి కుమారుడు ఉదయ్‌శంకర్‌రెడ్డి, మల్లెలపవన్‌కుమార్‌రెడ్డిఫౌండేషన్ రామసముద్రంకు చంఎదిన నాగేంద్రశెట్టి, శ్రీరాములపల్లె వెంకటప్ప భక్తులకు అన్నదానం చేశారు.

## సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే

పీలేరు, మార్చి 10 ప్రభాతవార్తః ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దొడ్డిపల్లె గ్రామం బంగారంచు ఎస్సీ కాలనీలో సామాజిక విప్లవకారిణి శ్రీమతి సావిత్రీబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధరణీకుమార్, సుభాష్, బాస్ నాయకులు కష్ణయ్య, రెడ్డయ్య, ఆనంద్, బాలగంగాధర్, విజయ్, రెడ్డెమ్మ, వరలక్ష్మీ, ప్రసన్న, నీలావతి, సుబ్బమ్మ,రాణెమ్మ, నాగరత్న, శ్రీలేఖ, గుర్రప్ప, వెంకటరమణ, సుబ్రమణ్యం, సురేంద్ర, చెంగర్‌రాయులు, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఫోటోరైటప్ః సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దశ్యం(3)

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వద్దుడు మృతి

కేవిపల్లె, మార్చి 10 ప్రభాతవార్తః మండలంలోని ఎంవి.పల్లె పంచాయతీ తురకపల్లెకు చెందిన వెంకటయ్యను ఆదివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వెంకటయ్య గుండ్రేవారిపల్లె క్రాసుకు వచ్చి తిరిగి వెలుతుండగా కమ్మపల్లె వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది.కుటుంబ సభ్యులు వెంటనే పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మతిచెందారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రహీముల్లా తెలిపారు.

## ఎంపీ , ఎమ్మెల్యేలను గెలిపించండి



పీలేరు, మార్చి 10 ప్రభాతవార్తః పట్టణంలో కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పట్టణ అభివద్దిని చూసి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలను ఆశీర్వదించాలని పంచాయతీరాజ్ జిల్లా అభివద్ది సలహామండలి సభ్యులు డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని వేణుమహల్ వీధి, షకీనా సువార్త ప్రార్థనామందిరం తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మనకు సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగాలంటే మనందరం కలిసిరాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలోచర్చి షాదర్ షాముల్లా, వైస్‌ఎంపీపీ ఎన్‌వి.చలపతి, వార్డుమెంబర్లు కాలేషా, ఆబీద్,పరమేష్, ఏఎంసీ డైరెక్టర్ మునీర్, వైసీపీ కార్యకర్తలు జిలాని, రఫీ, ముస్తక్ , మణి, నిజామ్, మల్లికార్జున , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### బిజెపితో టిడిపి పొత్తు రాష్ట్రానికి వినాసకరం
### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబ



మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త : బిజెపితో టిడిపి పొత్తు పెట్టుకోవడం రాష్ట్రానికి వినాసకరమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బిజెపి, తెలుగుదేశం, జనసేనతో కలసి రాష్ట్రానికి మరణశాసనం రాసింది. ఈ పొత్తు రాష్ట్రానికి విగాతం కలిగిస్తొందన్నారు. ప్రజల అభీష్టానికి వ్యతిరేకం అన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపితో తెలుగుదేశం, జనసేన పొత్తు పెట్టుకోవడం విశ్వాసఘాతానికి పాల్పడడమే అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా నిరాకరించిన బిజెపితో భాగస్వామిగా ఎన్‌డిఏలో చేరుతున్నామని చంద్రబాబు ప్రకటించడం తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమే అన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని, పొత్తుపెట్టుకొన్న టిడిపి, జనసేన పార్టీలను నిరంకుశ వైసిపిని ఓడించాలని పిలుపునిచ్చారు. గతంలో ఈపార్టీలు పొత్తుపెట్టుకొని రాష్ట్రానికి ఏమి సాధించారన్నారు.

## ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలి
### - అడిషనల్ జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి- రవిచంద్ర, గౌతమ్ పాఠశాలల్లో ఘనంగా స్వర-2024 వేడుకలు

గాలివీడు, మార్చి 10(ప్రభాతవార్త): ప్రతీ విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నమయ్య జిల్లా అడిషనల్ జడ్జి కృష్ణన్‌కుట్టి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రవిచంద్ర, గౌతమ్ పాఠశాలల వెల్‌కమ్ స్వర 2024 ఫేర్‌వెల్‌డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో నిర్వహించిన స్వర-2024 సమావేశానికి అడిషనల్ జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి, రాష్ట్ర డీటీపీ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థినీ విద్యార్థులు ఆటపాటలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ జడ్జి కృష్ణన్‌కుట్టి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకునే దశలోనే అన్ని రంగాలపై అవగాహన పెంచుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా రాణించి జీవితంలో పైకి రావాలని ఆకాంక్షించారు. డీటీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. సమాజంలో విలువలు నేర్చుకోవాలని, జీవితంలో చదువు అనేది ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. వైస్ ఎంపీపీ యదుభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో మెలగాలని చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రులకు గురువులకు దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి తన కాళ్లపై తమ నిలడాలని అంతేకాక మరొకరికి సహాయ సహకారాలు అందించే స్థాయికి ఎదగాలని సమాజంలో మంచి పౌరులుగా తయారవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఎస్‌కే ఖాదర్‌మొహజుద్దీన్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆవుల నాగభూషణ్‌రెడ్డి, పాఠశాల యాజమాన్యం షింటో ఇమ్మాన్యుయేల్, సైజుథామస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన సభ

మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త: అన్నమయ్యజిల్లా మండల కేంద్రమైన నిమ్మనపల్లెలోని తెలుగుహైస్కూల్‌లో ఆదివారం 50ఏళ్ళ క్రితం పాఠశాలను వదలిన పూర్వపు విద్యార్థిని విద్యార్థులు ఆదివారం (గోల్డన్‌జుబ్లి) స్వర్ణత్సోవాలు ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా దాదాపు 40మంది పూర్వపు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని గతంలో చేసిన కార్యక్రమాలను విపులంగా చర్చించి సంతోష సంబరాల్లో మునిగిపోయారు. ఈసందర్భంగా ఈ బ్యాచ్‌లోని విద్యార్థులు ముఖ్యంగా డాక్టర్లు, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది, పోలీస్‌శాఖ, తదితర కంపెనీలతో పాటు పలు ప్రైవేటు ఉద్యోగాలు, ఇతర దేశాల్లో స్తిరపడడం సంతోషదాయకమని గురువు శివనాగయ్య, తెలిపారు. పూర్వపు విద్యార్థిని విద్యార్థులను పలవురు ప్రసంగించగా పాఠశాలలో ఉన్న మదురుక్షణాలను పూర్వపు విద్యార్థి నారాయణ సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పి.విజయ భాస్కర్, మునిశంకర్‌రెడ్డి, నారాయణ, చినప్పరెడ్డి, నాగరాజ, రమణ,

శ్రీనివాసులు, ఫణింద్ర తదితరులు పాల్గొన్నారు.





## పేదల అభ్యున్నతే,కాస్కో సంస్థ ధ్యేయం..
### టీం లీడర్..సాయి సందీప్

ఫోటో:పేద పిల్లలకు పాఠ్య పుస్తకాలు,స్వీట్లు పంచుతున్న టీం సభ్యులు





రాజంపేట,మార్చి 10,ప్రభాతవార్త: పేదల అభ్యున్నతే ప్రధాన ధ్యేయంగా కాస్కో కంపెనీ ఎంచుకుందని ఆ కంపెనీ టీం లీడర్,సాయి సందీప్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా శనివారం కాస్కో కంపెనీ ఆధ్వర్యంలో టీం లీడర్ తన సభ్యులతో కలిసి రాజంపేట పట్టణంలోని,మన్నూరు లో ఉన్న పేద పిల్లల బాలల సదన్ పాఠశాలలో పేద పిల్లలకు పాఠ్య పుస్తకాలు,పెన్సిల్లు,ప్యాడ్లు ,మెండర్లు,ఏరేజర్లు,స్వీట్లు,శీతల పానీయాలు,అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాస్కో కంపెనీ భారతదేశం లోని పలు రాష్ట్రాల్లో విస్తరించి ఉందన్నారు.ఈ కంపెనీ పేదల పట్ల ప్రత్యేక దృష్టి సారించి వారి కష్టనష్టాలకు అనుగుణంగా తమ వంతు సహాయ సహకారాలు అందించి పేదలకు సహకరించాలని నిర్ణయం తీసుకుందన్నారు.ఇందులో భాగంగానే మొట్టమొదటిగా అన్నమయ్య జిల్లా,రాజంపేట మండలంలో మన్నూరు గ్రామంలోని పేద పిల్లల బాలల సదన్ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఎంచుకోవడం జరిగిందన్నారు.తమ ఆధీనంలో సుమారు 120 మందికి పైగా టీం సభ్యులను ఏర్పడమన్నారు.ఈ సభ్యులు సమాజ సేవకు,పేదలకు సహాయ సహకారాలు అందించేందుకు సంస్థ ద్వారా అన్ని విధాల ముందు ఉంటుందన్నారు.ఇదే కాకుండా అనాథ ఆశ్రమాలు పేద పిల్లలున్న పాఠశాలలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు ఆదరణ కల్పించడం వంటి కార్యక్రమాలను కూడా సమస్త ద్వారా మా టీం సభ్యులు అన్నివేళలా అందుబాటలో ఉండి అన్ని విధాల సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు..ఈ కార్యక్రమంలో టీం సభ్యులు నాగార్జున,వెంకటేష్ సురేష్,చందచప్రశాంత్,పెంచలయ్య,మణి,రామయ్యలతో పాటు సుమారు 20 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా వాలీశ్వరస్వామి రథోత్సవం

రామసముద్రం, మార్చి 10 ప్రభాతవార్త : మండలంనలోని ఆర్ నడింపల్లె పంచాయితీ బలసముద్రం కొండపై వెలసిన వాలీశ్వరస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ రథోత్సవానికి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. బందోబస్తులో డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంకా సరిహద్దులు గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. వీటిపై ఎస్ఐ క్లుప్తంగా వివరించారు. ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో బార్డర్ చెక్‌పోస్టుల్లో వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో సిఐ సద్గురుడు, ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## క్రీడలతోనే మానసిక ఉల్లాసం వైకాపా ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్



మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందని వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. ఆదివారం రూరల్ మండలంలోని ఈశ్వరమ్మ కాలనీ నందు ఎస్ఎంబి బ్రదర్స్ ఆధ్వర్యంలో క్రికెట్‌మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నిస్సార్‌అహ్మద్ బ్యాట్ పట్టి బ్యాటింగ్ చేశారు. అనంతరం క్రికెట్‌మ్యాచ్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం పనిఒత్తిడితో బిజీగా ఉంటే యువకులు క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. గ్రామీణ క్రీడల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై క్రీడా నైపుణ్యతను కూడా సాధించాలన్నారు. దీంతో ఆయనకు ఎస్ఎంబి బ్రదర్స్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జింకాచలపతి, వైకాపా నాయకులు, కార్యకర్తలు క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర భవిష్యత్తు కోసమే బిజెపితో టిడిపి పొత్తు
### మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త : రాష్ట్ర భవిష్యత్తు కోసమే టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బిజెపితో పొత్తు పెట్టుకొన్నారని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం టిడిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఏకైక నాయకుడు నారా చంద్రబాబునాయుడు అన్నారు. బిజెపితో పొత్తును మైనార్టీలు సమర్థిస్తూ ధైర్యంగా ఉండండి అందిరి హక్కుల కాపాడే భాద్యత చంద్రబాబునాయుడు తీసుకొంటారన్నారు. ఎన్ఆర్‌ఐసి, సిఏఏ బిల్లులు ముస్లిం మైనార్టీలకు ప్రత్యేకించకుండా చంద్రబాబునాయుడు తీసుకొంటారన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు సకాలంలో పెన్షన్ ఇవ్వక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపిలను ఆదరించాలన్నారు. ఉమ్మడి అభ్యర్థిలను గెలిపించి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడును గెలిపించాలన్నారు. బిజెపిపై ఎవరైనా విమర్శలుచేస్తే నమ్మరాదంటూ చెప్పారు. రాష్ట్రంలో 5కోట్ల మంది ఆంధ్రుల ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకోవడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, నాయకులు కట్టాదొరస్వామినాయుడు

జేసిబి మధుసూదన్‌రెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

